రేపు చేనేతల ఆత్మీయ సమావేశం

హాజరుకానున్న మంత్రులు సవిత, సత్యకుమార్

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీరాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో ఈనెల 19న చేనేతల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు పట్టు చీరల వ్యాపారుల సంఘం పట్టణాధ్యక్షుడు గిర్రాజురవి తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేనేతల ఆత్మీయ కలయికలో నేతన్న ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, వైద్యఆరోగ్యశాఖ మంత్రిసత్యకుమార్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారన్నారు. సమావేశంలో చేనేత సంఘం నేతలు జయశ్రీ, కలవల రాంకుమార్, పోలా ప్రభాకర్ పాల్గొన్నారు.

యువతకు వాల్మీకి స్ఫూర్తి

రామాయణాన్ని ప్రపంచానికి తెలిపిన
మహనీయుడు

- వాల్మీకుల 'ఎస్టీ' పునరుద్ధరణకు చంద్రబాబు, లోకేశ్ కృషి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- అనంతలో ఘనంగా రాష్ట్రస్థాయి వాల్మీకి జయంత్యుత్సవాలు
- హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రామాయణాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి వాల్మీకి మహర్షి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. నేటితరం యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతపురం నగరంలో గురువారం వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి పాతూరు పవర్ ఆఫీస్ సమీపంలోని వాల్మీకి విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుత్తి రోడ్డులోని బళ్లా కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకలలో పాల్గొన్నారు. వాల్మీకి జయంతి వేడుకలను రాష్ట్రస్థాయిలో నిర్వహించడం ద్వారా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై వారు గట్టిగా నిలబడ్డారని అన్నారు. దేవుళ్లు ఎలా ఉంటారో ఎన్టీఆర్ చూపించారని, బడుగు, బలహీన వర్గాల కష్టనష్టాలను గుర్తించిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని అన్నారు.

(మిగతా 7వ పేజీలో..)



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత, ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు, అధికారులు

మార్గదర్శకుడు వాల్మీకి మహర్షి

జేసీ అభిషేక్ కుమార్



వాల్మీకి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి.. నేటి తరానికే కాకుండా భావితరాలకు సైతం మార్గదర్శకుడు అని జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) అభిషేక్‌కుమార్ అన్నారు. స్థానిక సాయిఆరామంలో గురువారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి జేసీ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించిన మహనీయుడు వాల్మీకి అన్నారు. సన్మార్గంలో పయనించి, జీవితాల్లో వెలుగులు నింపుకోవాలన్నదే వాల్మీకి రామాయణం పరమార్థం అన్నారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, బీసీ సంక్షేమ శాఖాధికారి నిర్మలాజ్యోతి, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీ నివాళి

పుట్టపర్తిరూరల్: రామాయణ రచన ద్వారా ధర్మాన్ని చాటిచెప్పిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని ఎస్పీ రత్న పేర్కొన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ

దంచికొట్టిన వాన..

పొంగిపొర్లిన వాగులు, వంకలు

దెబ్బతిన్న పంటలు.. పలుచోట్ల కూలిన ఇళ్లు



మల్లెంపల్లి వద్ద ప్రవహిస్తున్న వంగపేరు





బూజుపట్టిన వేరుశనగ కట్టెని చూపుతున్న రైతు రామలింగప్ప, బూజుపట్టిన వేరుశనగ దిగుబడి



కనిశెట్టిపల్లిలో కూలిన మిద్దె

కొత్తచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గురువారం కూడా వర్షం దంచికొట్టింది. జిల్లావ్యాప్తంగా వాన కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొత్తచెరువు మండలంలోని మల్లెంపల్లి వద్ద వంగపేరు నది ఉధృతంగా ప్రవహించింది. కొడపగానిపల్లి సమీపంలోని సత్యసాయి పంప్‌హౌస్ వద్దగల బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించింది. దీంతో 4 గంటలదాకా వాహన రాకపోకలు స్తంభించాయి. లింగారెడ్డిపల్లి, కొత్తచెరువు ప్రాంతాల్లో సాగుచేసిన కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. పలుచోట్ల మొలకలు వచ్చాయి. పుట్టపర్తి మండంలోని వెంకటగారిపల్లికి చెందిన రామలింగప్ప వేరుశనగ పంట తొలగించిన తరువాత వర్షాలు రావడంతో కట్టె తడిసిపోయి, బూజు పట్టింది. కొత్తచెరువు మండలంలోని కనిశెట్టిపల్లిలో చంద్రమోహన్‌కు చెందిన పాత మిద్దె కూలింది. అమరాపురం మండలం హేమావతి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల సిద్దప్ప ఇల్లు నేల కూలింది. అదే ఇంట్లో నిద్రిస్తున్న సిద్దప్ప కుటుంబీకులు సురక్షితంగా బయటపడ్డారు. నిత్యావసరాలు నష్టపోయారు. ముదిగుబ్బ మండలంలోని ఎస్ బండ్లపల్లిలో వీరనారప్ప ఇంటి పైకప్పు కూలి, రూ.50వేలు నష్టం వాటిల్లింది.



మగ్గం గుంతలోకి చేరిన వర్షపు నీరు

మగ్గం గుంతల్లోకి వర్షపు నీరు

ధర్మవరం: వరుస వర్షాలకు పట్టణంలోని సంజయ్‌నగర్‌లోని పలు మగ్గం గుంతల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మగ్గాలు తడవడంతో వాటిని ఆరబెట్టుకోవడానికి కనీసం 20 రోజులు పడుతుందని చేనేత కార్మికులు వాపోయారు.

జలమయమైన ఖాద్రీశుడి ఆలయం



జలమయమైన ధ్వంజస్తంభం ప్రాంతం

కదిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం జలమయమైంది. ఆలయ ఆవరణం వర్షపునీటితో నిండిపోయింది. ధ్వంజస్తంభం ముందునుంచి ఆలయం వెలుపల వరకు భారీగా నీరు చేరింది. భక్తులు బయటకు రావడానికి, లోపలికి వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. భారీ వర్షం కురిసిన ప్రతిసారి ఆలయం జలమయమవుతోంది. వర్షపునీరు ఆలయంలోకి రాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని భక్తులు కోరుతున్నారు.

వాన నష్టంపై నివేదికలు రూపొందించండి : కలెక్టర్



పుట్టపర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలకు వాటిల్లిన ఆస్తి, ప్రాణ నష్టం నివేదికలను రూపొందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలో ఎక్కడ తాగునీటిపైపులు లీకేజ్ కాకుండా చూడాలంటూ జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులనుఆదేశించారు. స్థానిక కలెక్టర్‌లోని తన క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. డయేరియా ప్రబలకుండా చర్యలు చేపట్టాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. ధ్వంసమైన కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వర్షపు నీటితో నిండిన చెరువులు, వాటి పరిస్థితిపై కలెక్టర్ ఆరాతీశారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాన కష్టం..!

కోసిన పంటలను కాపాడుకునేందుకు రైతుల తంటాలు



వర్షం తగ్గిన తరువాత రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న

వర్షానికి తడిస్తే ధాన్యం పాడైపోయే ప్రమాదం
సర్వం నష్టపోతామంటున్న రైతులు

చిలమత్తూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. సాగు చేసిన పంట చేతికందే వరకు కష్టంగా మారుతోంది. ఓవైపు చీడపురుగులు, రోగాలు మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు రైతన్నల పాలిట శాపంగా మారుతున్నాయి. ఇటీవలిగా కురుస్తున్న భారీ వర్షాలు రైతుల కంట నీరు తెప్పిస్తున్నాయి. ఖరీఫ్‌లో బోర్లు, వర్షాధారంగా సాగుచేసిన పంటలు కోతకు వచ్చాయి. ప్రస్తుతం భారీ వర్షాలతో పండిన పంటను ఇంటికి తెచ్చుకోలేకపోతున్నారు. చేనులోనే పంటలు నీట మునుగుతున్నాయి. కోసిన పంటను నూర్పిడి చేసుకోలేక, ఆరబెట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు.



మొక్కజొన్న ధాన్యంపై కప్పిన టార్పాలిన్

ఇంటికి తీసుకెళ్లడం గగనమే..

మండలంలో అత్యధికంగా మొక్కజొన్న, వేరుశనగ పంటలు సాగయ్యాయి. వేరుశనగ పంటను ఇప్పటికే తొలగించగా.. బోర్లుకింద సాగైన మొక్కజొన్న పంటను కోశారు. నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో తొలగించిన వేరుశనగ పంట తడిసి ముద్దయింది. కాయలను కోసుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏదోరకంగా కోసిన కాయలను ఆరబెట్టుకోవడానికి తల ప్రాణం తోకకు వస్తోంది. మొక్కజొన్న విషయానికి వస్తే కోసిన కంకెలను పచ్చిగా ఉన్నట్లే యంత్రాలతో నూర్పిడి చేసుకుంటున్నారు. గింజలు పచ్చిగా ఉండటంతో వాటిని ఆరబెట్టుకోవడం కష్టంగా మారింది. రోజూ వర్షం కురుస్తుండటంతో గింజలు ఆరడం లేదని రైతులు వాపోతున్నారు.

తడుస్తున్న ధాన్యం

వారం రోజులుగా జడివాన కురుస్తోంది. దీంతో నూర్పిడి చేసుకున్న ధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూర్పిడి చేసిన మొక్కజొన్నలు, వేరుశనగ కాయలను ఆరబెట్టుకునేందుకు ఇద్దరు వ్యక్తులు దగ్గరే ఉండాల్సి వస్తోంది. ఏ సమయంలో వర్షం వస్తుందో పాలిథిన్ కవర్‌ను సిద్ధంగా పెట్టుకుంటున్నారు. రోజులో నాలుగైదు సార్లు చిరుజల్లులు పడి ఆగిపోతుండడంతో ప్రతిసారీ ధాన్యం కుప్ప తోయడం, వర్షం ఆగిన తరువాత దానిని విడదీయడం చేస్తున్నారు. దీంతో పక్కకు కూడా వెళ్లలేని పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. వర్షానికి ధాన్యం తడవడం ఖాయం. అదే జరిగితే ఆరుగాళం కష్టపడి పండించిన పంట నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. పంట దిగుబడి తడిసిపోతే నాణ్యత తగ్గిపోతుంది. అలాంటి ధాన్యం ధర పడిపోతుందనీ, వ్యాపారులు కొనేందుకు ఆసక్తి చూపరని రైతులు చెబుతున్నారు. ధాన్యం నాణ్యత పూర్తిగా దెబ్బతినడం వలన అమ్మకోలేని పరిస్థితి వస్తుందని అంటున్నారు.

నూర్పిడి యంత్రాలు, కల్లాలు లేక..

పండించిన పంటను చివరి దశలో నూర్పిడి చేసుకుని, నాణ్యత కోల్పోకుండా భద్రపరచుకుంటేనే మార్కెట్లో మంచి ధర లభిస్తుంది. ఆ అవకాశాలు ఇక్కడి రైతులకు లేకపోవడం శోచనీయం. వేరుశనగ, వరి, మొక్కజొన్న వంటి పంటలను నూర్పిడి చేసుకోవడానికి యంత్రాలు అందుబాటులో లేవు. దాంతో సకాలంలో పంటను నూర్పిడి చేసుకోలేకపోతున్నారు. నూర్పిడి చేసుకున్న పంటను కూడా సక్రమంగా ఆరబెట్టుకోవడానికి అనుకూలమైన ధాన్యం కల్లాలు లేవు. దాంతో పండించిన ధాన్యాన్ని రోడ్ల పాలు చేసుకుంటున్నారు. వర్షం వచ్చినపుడు సకాలంలో భద్రపరచుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ తరుణంలో ఆరుగాళం కష్టపడిన పంటను ఇంటికి తీసుకెళ్లేవరకు రైతులకు భరోసా లేకుండా పోతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని, రైతులకు ప్రభుత్వం ధాన్యం నూర్పిడి యంత్రాలు, కల్లాలను సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వేరుశనగ కట్టెకి పాలిథిన్ పట్టను కప్పిన రైతు

పంటను కాపాడుకోవడం కష్టమైంది



పండించిన పంటను ఇంటికి తీసుకెళ్లి ఆరబెట్టి భద్రపరచుకోవడం కష్టంగా మారుతోంది. గ్రామంలో ధాన్యం ఆరబెట్టుకోవడానికి కల్లాలు లేవు. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతానికి వచ్చి ఆరబెట్టుకుంటున్నాం. వర్షం గంటకోసారి ఆగుతూ కురుస్తోంది. దీంతో ధాన్యం కుప్పనూకడం, మళ్లీ ఆరబెట్టడం పనిగా మారింది.

-ఆనందరెడ్డి, రైతు, పలగలపల్లి

ఆరడంలేదు..



రెండెకరాల్లో వేరుశనగ సాగు చేశా. వారంరోజుల క్రితం పంటను కోసి, ఇంటికి తీసుకొచ్చా. అప్పట్నుంచి కాయ, కట్టె ఆరడం లేదు. దాంతో చెట్లలో కాయలు నల్లబారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో కాయకట్టెని భద్రపరచుకోవడం కష్టమవుతోంది. ఇలాగే వర్షం కురిస్తే కాయలు మొలకలు వస్తాయి.

-బయపరెడ్డి, రైతు, కోట్లోపల్లి

యూటీఎఫ్ సత్యాగ్రహ దీక్ష

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్.. డీఈఓ కార్యాలయం ఎదుట బైఠాయింపు



డీఈఓ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నాయకులు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత కారణంగా ఉన్నవారిపై పనిఒత్తిడి పెరిగిందన్నారు. ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. నవంబరులోగా అప్‌గ్రేడ్ పోస్టుల్లో మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్ కల్పించాలని కోరారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులైన వారికి అర్బన్ ఎంఈఓలుగా నియమించాలన్నారు. బోధనేతర సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈఓ మీనాక్షికి అందజేశారు. దీక్షలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శులు సీసీ నరేశ్‌కుమార్, లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

21న ఎమ్మెస్సీ స్పాట్ అడ్మిషన్స్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐలో ఎమ్మెస్సీ స్పాట్ అడ్మిషన్స్ ఇస్తామని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ కిరణ్మయి గురువారం తెలిపారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆదేశాల మేరకు పీజీ సెట్ కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని అన్నారు. 21న జేఎన్‌టీయూ పరిపాలనా భవనంలో నిర్వహించే అడ్మిషన్స్‌కు ఆసక్తిగల విద్యార్థులు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు. పీజీ సెట్‌లో అర్హత సాధించి, ఇప్పటివరకు ఎక్కడా ప్రవేశాలు పొందని వారు స్పాట్ అడ్మిషన్‌లకు అర్హులని తెలిపారు. అడ్మిషన్ అయిన వెంటనే కోర్సు ఫీజు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రైల్వే రిజర్వేషన్ కాలపరిమితి కుదింపు

ఇకపై రెండు నెలలకు ముందు మాత్రమే..

గుంతకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణానికి రిజర్వేషన్ చేసుకునే గడువును రైల్వే శాఖ కుదించింది. అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ (ఏఆర్‌పీ) నిబంధనలను అనుసరించి ప్రస్తుతం నాలుగు నెలల ముందే బెర్త్‌ను రిజర్వేషన్ చేసుకునే వీలుంది. ఆ కాలాన్ని రైల్వే శాఖ 60 రోజులకు కుదించింది. నవంబరు 1వ తేదీ నుంచి ఈ మార్పు అమలులోకి రానుంది. ఇప్పటికే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తమ టిక్కెట్లను రద్దు చేసుకోదలిస్తే, పాత నిబంధనలను అనుసరించి నవంబరు 1 లోపు కూడా రద్దు చేసుకునే వీలు కల్పించారు.

అక్రమాలు జరక్కుండా..

నాలుగు నెలల ముందు బెర్త్ టిక్కెట్లు రిజర్వు చేసుకునే పద్ధతి అక్రమాలకు అవకాశం ఇస్తోందని రైల్వే శాఖ తెలియజేసింది. అవసరం లేకపోయినా కొందరు టిక్కెట్లను రిజర్వేషన్ చేసి, బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని పేర్కొంది. నాలుగు నెలల ముందు రిజర్వు అయిన బెర్తులు ఎక్కువ సంఖ్యలో రద్దు అవుతున్నాయని, దాదాపు 21 శాతం టిక్కెట్లు క్యాన్సిల్ అవుతున్నాయని అధికారులు తెలిపారు. త్వరగా టిక్కెట్లు అమ్ముడవుతున్నందున బెర్త్ కన్ఫర్మ్ కాదన్న కారణంగా కొందరు ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించడానికి ఇష్టపడటం లేదని, దీనివల్ల 4 నుంచి 5 శాతం మంది ప్రయాణాలకు ఇతర మార్గాలను ఎంచుకుంటున్నారని తెలియజేశారు. 1981 నుంచి ఇప్పటిదాకా రైల్వే శాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్‌ను 12 సార్లు మార్చింది. 120 రోజులు, 90 రోజులు, 60 రోజులు, 45 రోజులు, 30 రోజులు.. ఇలా పలుమార్లు ఏఆర్‌పీని మార్చింది. ప్రస్తుతం 60 రోజులకు కుదించిన కారణంగా అక్రమాలు అదుపులోకి వస్తాయని, ప్రయాణికులు చాలా ముందుగా డబ్బు చెల్లించాల్సిన అవసరం ఉండదని రైల్వే శాఖ తెలియజేసింది.

క్రైం కార్నర్

భార్య సొంతూరికి రాలేదని ఆత్మహత్య



మధుసూదన్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): భార్య సొంతూరుకు రాలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం పట్టణంలోని రైల్వేక్వార్టర్స్‌లో జరిగింది. రైల్వే ఉద్యోగి మధుసూదన్(34) రైల్వేక్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. ఇతను డీఆర్‌ఎం కార్యాలయంలోని కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో ఓఎస్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతని మొదటి భార్య రోడ్డు ప్రమాదంలో నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందింది. రెండేళ్ల క్రితం బళ్లారికి చెందిన హేమావతిని వివాహం చేసుకున్నాడు. దసరా సందర్భంగా తన సొంతూరు ప్రొద్దుటూరు మండలం లింగాపల్లికి వెళ్లాలని భార్యను కోరాడు. ఆమె నిరాకరించింది. ఈ నేపథ్యంలో అతను, అతడి కుమార్తె ఊరికి వెళ్లి సోమవారం తిరిగి వచ్చారు. అప్పటి నుంచి దిగాలుగా ఉండేవాడు. బుధవారం రాత్రి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 9 గంటలైనా భర్త గది తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో భార్య హేమావతి తలుపులు బద్దలు కొట్టించింది. ఉరివేసుకుని ఉండటం చూసి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన గౌస్‌పీరాపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. ఓ యువతిని కొంత కాలంగా అతడు వేధిస్తున్నాడు. దీంతో ఆ యువతి కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి గౌస్‌పీరాను మందలించేందుకు వెళ్లారు. మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. యువతి కుటుంబ సభ్యుడు బ్రహ్మ, మధ్యవర్తిగా వెళ్లిన రాజుపై గౌస్‌పీరా కత్తితో దాడిచేయడంతో వారికి గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు గౌస్‌పీరాపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహ్మద్ గౌస్‌బాషా తెలిపారు.



● ఈ చిత్రంలో కనిపిస్తున్న ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్ శింగనమల మండలం కల్లుమడి గ్రామంలోనిది. ఈనెల 9న గ్రామానికి చెందిన నాగార్జున పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగితీగను దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో చుట్టుపక్కల వ్యవసాయ కనెక్షన్లకు కరెంటు సరఫరా ఆగిపోయింది. రైతులు సాగు చేసిన పంటలకు నీరు పెట్టేందుకు ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు పేట్రేగిపోతున్నారు. వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని, అందులోని ఆయిల్, కాపర్ చోరీ చేస్తున్నారు. గడిచిన పది నెలల్లో వందకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు విద్యుత్ శాఖ అధికారుల సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేయడంతో రైతులు కరెంటు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- అనంతపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)



● యాడికి మండలంలో పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు పదుల సంఖ్యలో జరిగాయి. ఇటీవల మండలంలోని రాయలచెరువు, చందన గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారు. వాటిలోని రాగి, అల్యూమినియంను దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. మండలంలో ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నట్లు సమాచారం. అయితే పోలీసులు కేసులు నమోదు చేయకపోవడం గమనార్హం.



● ఇక్కడ ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్స్ బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లిలోనిది. ఈనెల 7న రాత్రి గ్రామ శివారులోని పొలాల్లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి తీగను చోరీ చేశారు.

● రాప్తాడు మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన రైతులు ఎర్రిస్వామి, మల్లేష్, రాజు కలిసి 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 6న రాత్రి దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని రాగి వైరు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు.

ఇంకేమీ దొరకవా..?

- పేట్రేగిపోతున్న దొంగలు
- వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యం
- ఈఏడాదిలో వందకుపైగా ధ్వంసం
- కాపర్, ఆయిల్ చోరీ
- కరెంటు లేక రైతుల ఇబ్బందులు
- విద్యుత్ శాఖపై అదనపు భారం

కాపర్, ఆయిల్ చోరీ

దొంగలు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్, ఆయిల్ చోరీ చేస్తున్నారు. మార్కెట్‌లో కాపర్ విలువ ఎక్కువగా ఉండటంతో దొంగలు ఈ దారి ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అందులోను ఎక్కువగా వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లనే లక్ష్యంగా చేసుకుని చేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో అల్యూమినియం, కాపర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. వీటిలో అల్యూమినియం ట్రాన్స్‌ఫార్మర్ కంటే కాపర్ ట్రాన్స్‌ఫార్మర్ దొరికితే దొంగలకు పండగే. మార్కెట్‌లో కాపర్‌కు ధర ఎక్కువ ఉండటమే కారణం. కాగా వ్యవసాయానికి 25కేవీ, 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 30 నుంచి 35కిలోలు, 16కేవీలో 25నుంచి 30కిలోలా కాపర్ ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో కిలో కాపర్ రూ.1000కిపైగానే పలుకుతోంది. కిలో అల్యూమినియం రూ.350 ఉంటోంది. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్స్‌లోని ఆయిల్ లీటర్ రూ.100 వరకు పలుకుతోంది. వీటిని దొంగిలించి గుజిరీ షాపుల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ శాఖపై భారం

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలతో విద్యుత్ శాఖపై అదనపు భారం పడుతోంది. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం జరిగితే..అక్కడ కొత్తది ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అల్యూమినియం 1.40లక్షలు పలుకుతోంది. ఇక కాపర్ ట్రాన్స్‌ఫార్మర్ 2.15లక్షల వరకు ఉంటోంది. 16కేవీ కాపర్ ట్రాన్స్‌ఫార్మర్ రూ.1.80లక్షలు ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈఏడాది అనధికారికంగా వంద ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయినట్లు తెలుస్తోంది. అయితే అధికారుల లెక్క 70లోపు ఉంది. ఈ లెక్కన చూసుకున్నా సగటున ట్రాన్స్‌ఫార్మర్ ధర రూ.1.50లక్షలు అనుకున్నా 1.05కోట్లు విద్యుత్ శాఖపై అదనపు భారం పడింది.

ఎఫ్ఐఆర్ ఉంటేనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తేనే విద్యుత్ శాఖ కొత్తవి ఇవ్వడానికి వీలుంటుంది. ఎఫ్ఐఆర్ కాపీ ఆధారంగా విద్యుత్ అధికారులు ఎస్టిమేషన్ వేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు. అయితే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. క్రైం నెంబరు పెరిగితే తమకు ఇబ్బందులు వస్తాయన్న నెపంతో ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు సంబంధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

ఆ తర్వాతే మంజూరు

రైతులు ఎవరైనా ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయినట్లు ఎఫ్ఐఆర్ కాపీ తీసుకొచ్చి విద్యుత్ అధికారులకు ఇచ్చిన వెంటనే మరో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తాం. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్, ఇతరత్ర సామగ్రి కొరత ఉంది. ఈ నేపథ్యంలో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినా సమస్య తీవ్రత మేరకు రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఈనెల చివరికి సమస్య సద్దుమణిగే అవకాశం ఉంది.

-సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

ముంచిన వాన



తొండపాడు వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

- తడిసిన పత్తి.. వేరుశనగ
- రంగు మారితే కొనేవారు ఉండరు
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు

గుత్తి రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు వేరుశనగ, పత్తి రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. మండలంలో పలువురు రైతులు వేరుశనగ పంటను తొలగించారు. కొందరు పొలాల్లోనే కుప్పలుగా వేసుకున్నారు. వర్షానికి తడిచి కట్టె, కాయలు నల్లగా మారుతున్నాయి. పశువుల మేతగా వాడే వేరుశనగ కట్టె పనికి రాకుండాపోతోంది. రంగు మారిన కాయలను మార్కెట్‌లో కొనేవారు ఉండరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు వేరుశనగ కాయలను పొలాల్లో రాశులు పోశారు. తేమ కారణంగా ఊజి సోకుతోంది. వాటిని ఆరబోసుకునే వీలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు రైతులు పంట దిగుబడిని కాపాడుకునేందుకు వేల రూపాయలు వెచ్చించి టార్పల్‌లు కొని కప్పుకున్నారు. పత్తి పంట ప్రస్తుతం కాయ పగిలే స్థితిలో ఉంది. వర్షానికి నీరు చేరి పత్తి రంగు మారుతోంది. పత్తికాయలు మురిగిపోతున్నాయి. తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జక్కలచెరువు వద్ద సాగు చేసిన పత్తి పంట



బేతాపల్లి వద్ద తడిసిపోయిన వేరుశనగ

వర్షాలతో నష్టమే..



ఈ సమయంలో వర్షాలు పడితే పత్తికాయలు మురిగిపోతాయి. పత్తి రంగు మారుతుంది. మార్కెట్‌లో సరైన ధర పలకదు. నష్టలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎకరా పత్తి పంట సాగుకు రూ.30 వేల వరకు ఖర్చు వస్తుంది. పంట చేతికొచ్చే సమయంలో వర్షం కురిస్తే పెట్టుబడి కూడా రాదు. నేను 5 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను.

-సూర్యనారాయణ, బేతాపల్లి

చిన్నపాటి వాన

అనంతపురం అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం మోస్తరు వర్షం కురిసింది. డి.హీరేహాళ్ మండలంలో అత్యధికంగా 28.6 మి.మీ వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్‌లో 21.4, కళ్యాణదుర్గం 13.4, గార్లదిన్నె 11.4, కూడేరు 11.2, యల్లనూరు 10.8, ఉరవకొండ 10.4, కణేకల్లు 10.0, రాప్తాడు 9.0, శింగనమల 8.4, రాయదుర్గం 7.8, అనంతపురం 5.4, బుక్కరాయసముద్రం 4.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 3.6 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి చిరుజల్లులు, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

వేరుశనగ తడిసిపోయింది



నేను నాలుగు ఎకరాల్లో వేరుశనగ, మరో నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. వర్షంతో రెండు పంటలకూ నష్టమే. వేరుశనగ తొలగించి పొలంలోనే కుప్పలు వేశాను. వర్షానికి మొత్తం తడిసిపోయింది. కట్టె కుళ్లిపోతోంది. పశువులకు మేత లేకుండా పోతుంది. కాయలు రంగు మారుతాయి. పత్తి కూడా దెబ్బతింటుంది. ఈ ఏడాది వ్యవసాయం కలిసిరాలేదు. అంతా నష్టమే.

-ప్రసాద్, బేతాపల్లి

జల వనరులకు కళ

చిత్రావతి ఉధృతితో నిలిచిన రాకపోకలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులకు భారీగా నీరు చేరుతోంది. న్యామద్దల, కనుముక్కల చెరువులు నిండి మరువ పారుతున్నాయి. వెల్దుర్తి, చిన్నపరెడ్డిపల్లి వద్ద చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు ప్రవాహ ఉధృతి తగ్గలేదు.

దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు బుక్కపట్నం, కొత్తచెరువు మీదుగా ప్రయాణం సాగిస్తున్నారు. ధర్మవరం ఆర్డీఓ మహేశ్, పీఆర్ ఎస్ఈ మురళీ, తహసీల్దారు సురేష్ కుమార్, డీఈ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్‌నాయక్ చిత్రావతి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. చిత్రావతి ప్రవాహంతో ఏటా చాలా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, పార్టీ నాయకులు పీఆర్ ఎస్ఈ మురళి దృష్టికి తీసుకెళ్లారు. రెండు ప్రాంతాలలో వంతెనల ఎత్తు పెంచాలని కోరారు. ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతామని ఇంజనీరింగ్ అధికారులు వారికి తెలిపారు. వర్షాల కారణంగా పలు గ్రామాల్లో పాత మిద్దెలు పడిపోయాయి.

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలి: ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని శ్రీసత్యసాయి జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు ఏపీజీఎల్ఐ డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్‌ను కోరారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రవికుమార్, గోపాల్ నాయక్ తదితరులు గురువారం డీడీని కలిశారు. మెచ్యూరిటీ అయిన బాండ్లను సకాలంలో క్లెయిమ్ చేయడం లేదని అన్నారు. ఆరు నెలలుగా వీటిని ఏపీజీఎల్ఐ ఆఫీస్ మేకర్, చెక్కర్, అప్రూవ్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉంచుతున్నారని అన్నారు. కొత్తగా ఏపీజీఎల్ఐ ప్రీమియం మొత్తాన్ని పెంచినా, టీచర్ల కొత్త బాండ్స్ అసంపూర్తిగానే జనరేట్ అవుతున్నాయని అన్నారు. వివిధ రకాల రుణాల కోసం దరఖాస్తు చేసినా.. ఆరు మాసాలుగా విడుదల కావడం లేదని అన్నారు. కొత్తగా జారీ చేసిన బాండ్స్‌లో నామినీ వివరాలను నమోదు చేయడానికి అవకాశం ఇవ్వడం లేదని అన్నారు. బీమా మిస్సింగ్ క్రెడిట్స్ వెంటనే అప్‌డేట్ చేయాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.



డీడీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

యువకుడి అదృశ్యం



నల్లప్ప

శింగనమల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తరిమెల గ్రామానికి చెందిన నల్లప్ప అనే యవకుడు సోమవారం అదృశ్యమయ్యాడు. ట్రాక్టర్ ఫైనాన్స్ వాయిదా మొత్తాన్ని చెల్లించేందుకు తన మామ రమణతో కలిసి నల్లప్ప సోమవారం అనంతపురం వెళ్లాడు. పని పూర్తి అయిన తరువాత నల్లప్పను రమణ ఆటో ఎక్కించి స్వగ్రామానికి పంపించాడు. కానీ నల్లప్ప గ్రామానికి చేరలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నల్లప్ప తల్లి రామాంజినమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు.

ఆస్పత్రిలోనే రోగులకు అన్ని సేవలు అందాలి

ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే అవసరం రాకూడదు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



వీసీలో పాల్గొన్న సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు

అనంతపురం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగికి ఆస్పత్రిలోనే అన్నిరకాల వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. అమరావతి నుంచి ఆయన వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కృష్ణబాబు, డీఎంఈ నరసింహంతో కలిసి వైద్యాధికారులు, విభాగాధిపతులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్యులు, వైద్యాధికారులు సమయ పాలన తప్పనిసరిగా పాటించాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రికి వచ్చిన ప్రతి రోగికీ సకాలంలో వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. రోగ నిర్ధారణ పరీక్షలను రాస్తే.. వాటిని సాయంత్రంలోపు పూర్తి చేయాలని, రోగికి అవసరమైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. మందులు, వైద్యం కోసం రోగులను బయటకు పంపకూడదని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రోగులు ఖర్చు పెట్టుకునే అవసరం రాకుండా చూడాలని అన్నారు. ఈ విషయంలో డాక్టర్లు బాధ్యతగా పని చేయాలని, వైద్యాధికారులు, హెచ్ఓడీలు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. రాత్రి విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బందికి కనీస వసతులు ఉండేలా సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల కారణంగా రోగుల తాకిడి పెరిగే అవకాశం ఉంటుందని, ప్రత్యేక శ్రద్ధ పెట్టి వైద్యం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

సొసైటీ పురోగతిపై బాధ్యత లేదా..?

సమీక్షా సమావేశంలో జేసీ శివనారాయణశర్మ



మాట్లాడుతున్న శివనారాయణ శర్మ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సొసైటీ పురోగతిపై బాధ్యత మీకు లేదా అని ఏడీసీసీ బ్యాంకు అధికారులను బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ప్రశ్నించారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్‌లో ఏడీసీసీ బ్యాంకు మేనేజర్లు, సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్రాంచ్‌లు, సొసైటీల వారీగా పురోగతిని సమీక్షించారు. సొసైటీల కంప్యూటరైజేషన్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేదని, వేగవంతం చేయాలని ఆదేశించారు. డిపాజిట్ల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నూతన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు విరివిగా రుణాలు అందజేసి వారి అభివృద్ధికి సహకారించాలన్నారు. తదుపరి సమావేశ సమయానికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీసీఓ అరుణకుమారి, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, ఓఎస్డీ సూర్యనారాయణ, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, నాబార్డు డీడీఎం అనురాధ, బ్యాంకు డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవ్‌బాబు, విజయచంద్రారెడ్డి, డీపీడీఎం తేజస్విణి పాల్గొన్నారు.

టీచింగ్ పోస్టుల కోసం నేటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

పది బృందాల ఏర్పాటు

అభ్యర్థులకు సమాచారం అందించాం: ఏపీసీ

అనంతపురం విద్య, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. సమగ్రశిక్ష ప్రాజక్టులో శుక్రవారం నుంచి వెరిఫికేషన్ చేయనున్నారు. ఇందుకోసం ఎంఈఓ లేదా హెచ్‌ఎంతోపాటు, స్కూల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌ని బృందంగా పెట్టారు. ఇలా 10 బృందాలను ప్రాజక్టు అధికారులు నియమించారు. ఖాళీగా ఉన్న పోస్టులకు 1877 దరఖాస్తులు వచ్చినట్టు జిల్లా ప్రాజక్టు అధికారులు తెలిపారు.

వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు తప్పనిసరి

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా పదో తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, మాస్టర్ డిగ్రీ(పీజీ), బీఈడీ, ఎంఈడీ, యూజీడీపీఈడీ, బీపీఈడీ, డిప్లొమో సర్టిఫికెట్లు తేవాల్సి ఉంటుంది. లోకల్ స్టేటస్, కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకోవాలి. దివ్యాంగులైతే అందుకు సంబంధించిన సర్టిఫికెట్ తప్పనిసరిగా తేవాలి. గతంలో పనిచేసిన అనుభవం ఉంటే ఎక్స్‌పీరియన్స్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుంది.

సమాచారం ఇచ్చాం: నాగరాజు, ఏపీసీ

శుక్రవారం ఉదయం 9.30 గంటలకు వెరిఫికేషన్ ఉంటుంది. 1:5 మేరకు అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించాం. సమాచారం అందిన అభ్యర్థులు మాత్రమే హాజరుకావాల్సి ఉంటుంది.



సమగ్రశిక్ష సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీసీ నాగరాజు


హాజరైన వాల్మీకులు

యువతకు వాల్మీకి స్ఫూర్తి

(5వ పేజీ తరువాయి)
బీసీలు, వాల్మీకులను గుర్తించడంలో సీఎం చంద్రబాబుకు ఎవరూ సాటి రారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలు ఆనందంగా ఉన్నారంటే సీఎం చంద్రబాబు చలవేనని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో మళ్లీ ఎన్టీఆర్ విదేశీ విద్యను, అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. బీసీలకు బీసీ భవన్‌లను ఏర్పాటు చేశారని అన్నారు. వైసీపీ బీసీ భవన్‌లపై బండ వేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం బీసీ భవనాలను నిర్మించేందుకు సిద్ధమవుతోందని అన్నారు. వేడుకలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చాటిన విద్యార్థులకు మంత్రి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందించి అభినందించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులు మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలను సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున, డీడీ కుష్బూకొఠారీ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర, టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, అనంతపురం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తలారి ఆదినారాయణ, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి, మాజీ మేయర్ స్వరూప, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, తెలుగు మహిళ నాయకురాలు సంగా తేజస్విని, బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు హరి, జనసేన నాయకుడు ఈశ్వర్, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, ఏబీసీడబ్ల్యూఓలు రంగమ్మ, సుభాషిణి, గంగాద్రి, బీసీ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సవిత


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ముందుండి నడిపిస్తా...



వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని ముందుండి నడిపిస్తా. పార్లమెంటు సమావేశాల్లో వాణిని గట్టిగా వినిపించి, ఎస్టీ జాబితాలో చేర్చేందుకు శాయశక్తులా కృషి చేస్తా. ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన వాల్మీకి జయంతిని రాష్ట్రస్థాయిలో ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సహకారంతో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించాం. వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి, మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడిన మహోన్నత వ్యక్తి. ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతాయి.

-అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం ఎంపీ

పార్లమెంటులో మాట్లాడతా..



అట్టడుగు స్థాయిలో ఉన్న బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం గురించి పార్లమెంటు సమావేశాల్లో మాట్లాడుతాను. ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి కేంద్రానికి పంపారు. ఎస్టీ జాబితా చేర్చే అంశం ప్రతి ఒక్కరి ప్రధాన అజెండా. అలాంటి అంశాన్ని వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి సర్వనాశనం చేశారు. వాల్మీకుల జీవితాలతో చెలగాటమాడి అంధకారంలోకి నెట్టేశారు. కృషి ఉంటే మనిషి రుషి అవుతారని చెప్పిన వాల్మీకి ఎంతో గొప్పవారు. అలాంటి వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలు అనంతలో జరగడం ఆనందంగా ఉంది.

- బీకే పార్థసారథి, హిందూపురం ఎంపీ

అందరికీ ఆదర్శం..



వాల్మీకి మహర్షి అన్ని వర్గాల ప్రజలకు ఎప్పటికీ ఆదర్శప్రాయుడే. ఎంతో విలువైన రామాయణాన్ని రచించి సంస్కృతి, సాంప్రదాయాలను నిలబెట్టారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం గురించి ఎంతో మంది మేధావులు, రాజకీయ నాయకులతో అప్పట్లో చంద్రబాబునాయుడు శాస్త్రీ అధ్యయనం చేయించారు. జగన్ ప్రభుత్వం ఆచరణలో పెట్టలేదు. వాల్మీకుల భవిష్యత్తుతో ఆడుకుంది. కూటమి ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని ప్రస్తావించి, కేంద్రానికి పంపి వాల్మీకుల్లో భరోసా నింపింది.

- కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే

ఎంపీలు చొరవ చూపాలి



వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలి. ఆ దిశగా జిల్లా ఎంపీలు చొరవ చూపాలి. నేను, కాలవ శ్రీనివాసులు మంత్రులుగా ఉన్నప్పుడు బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించి అసెంబ్లీలో తీర్మానం చేయించారు. ఆ కల నెరవేరే సమయంలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం ఆ అంశాన్ని గాలికొదిలేసింది.

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

టీడీపీతోనే సాధ్యం..



వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ టీడీపీతోనే సాధ్యమవుతుంది. జిల్లాలో అధికంగా ఉన్న బోయలు తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నో ఏళ్ల నుంచి కోరుకుంటున్నారు. చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం చేయించినా.. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాల్మీకులకు అన్యాయం జరిగింది. వాల్మీకుల న్యాయమైన డిమాండ్‌ను తెలుగుదేశం ప్రభుత్వమే సాధిస్తుంది. ప్రతి ఒక్కరూ వాల్మీకి ఆశయాల సాధనకు పాటుపడాలి.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

పార్టీని కాపాడుతున్న ముద్దుబిడ్డలు..



జిల్లాలో ఉన్న ఎంతో మంది వాల్మీకి ముద్దుబిడ్డలు టీడీపీని కాపాడుతున్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న కలను సీఎం చంద్రబాబునాయుడు సాకారం చేయాలని చూశారు. గతంలో అధికారంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి అడ్డు తగిలారు. కూటమి ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సిద్ధమైంది. అందులో భాగంగానే సీఎం చంద్రబాబు కేంద్రానికి ప్రతిపాదనలను పంపారు.

- అమిలినేని సురేంద్రబాబు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే

ఏకతాటిపైకి రావాలి...



వాల్మీకులు ఏకతాటిపైకి వచ్చి ఎస్టీ జాబితాను సాధించుకుందాం. ఎస్టీ జాబితా ప్రయత్నాలు పలుమార్లు జరిగాయి. తాజాగా చంద్రబాబునాయుడును ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్టీ రిజర్వేషన్ సాధన దిశగా అడుగులు వేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు సహకరిస్తే రాబోయే రోజుల్లో సీఎం సహకారంతో ఎస్టీ జాబితాలో బోయలను చేర్చడం సాధ్యమౌతుంది.

- గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఎమ్మెల్యే

వాల్మీకి స్ఫూర్తితో ముందుకెళ్లాలి..



రామాయణాన్ని రచించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి. ఆయన జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అనంతలో నిర్వహించడం గర్వకారణం. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలన్నది ఆ వర్గాల ఆకాంక్ష. ఎన్డీయే ప్రభుత్వంలో వారి కల సాకారమౌతుంది. ఇందుకు సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రస్తావించి కేంద్రానికి పంపడమే నిదర్శనం.

- బండారు శ్రావణిశ్రీ, శింగనమల ఎమ్మెల్యే

మాట నిలబెట్టుకుంటారు..



ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్. పాదయాత్రలో సమయంలో నారా లోకేశ్‌కు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం, జయంత్యుత్సవాలను రాష్ట్రస్థాయిలో నిర్వహించే అంశం గురించి విన్నవించాం. అధికారంలోకి వస్తే తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు.. చేసి చూపించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సీఎం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. అనుకున్న ప్రకారం అసెంబ్లీలో ప్రస్తావించి కేంద్రానికి పంపారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకూ ప్రతి ఒక్కరూ పోరాడాలి.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

భారతీయ సంస్కృతికి మూలం..



భారతీయ సంస్కృతి, జీవన విధానానికి మూలం రామాయణం. అలాంటి రామాయణ సృష్టికర్త వాల్మీకి పుట్టిన రోజును ఘనంగా జరుపుకుంటున్నాం. వాల్మీకి విలువలు, బోధనలు, జ్ఞానాన్ని అందరూ అందిపుచ్చుకోవాలి. రామాయణ ఇతిహాసాన్ని వాల్మీకి మహర్షి 23 వేల శ్లోకాలతో, ఏడు ఖండాలతో రచించారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతి ఉత్సవాన్ని అధికారికంగా రాష్ట్రస్థాయిలో జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని అనంతలో నిర్వహించేలా మంత్రి చొరవ చూపారు.

- పోలా భాస్కర్, బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

సంతోషకరం..



అనంతపురం జిల్లాలో మొట్టమొదటిసారిగా రాష్ట్రస్థాయి వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరం. మంత్రి సవిత, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేశారు. వాల్మీకి రామాయణాన్ని రచించి, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడారు. ఆ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి.

- డాక్టర్ వినోద్ కుమార్, కలెక్టర్


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులతో మంత్రి, ఎంపీలు, కలెక్టర్, ఎమ్మెల్యేలు

నేరమయ జీవితం..
మృగతత్వంతో సమానం

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

కదిరి లీగల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): నేరమయ జీవితమనేది మృగతత్వంతో సమానమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన కదిరి సబ్‌జైలును గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. దోపిడీలు, చోరీలు, జూదాలు, అరాచకాలు, అత్యాచారాలు తదితర అసాంఘిక, ఆటవిక కార్యక్రమాలు మనుషులు చేసే పనులు కావన్నారు. వాటిని చేసి జైలుకెల్లడం సిగ్గుచేటన్నారు. ఆది కుటుంబ సభ్యులు, పిల్లలకు అవమానకరమని పేర్కొన్నారు. జైలుకు వచ్చిన తరువాత మార్పు రావాలన్నారు. అనంతరం ఖైదీలకు ఇస్తున్న ఆహారం, సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు లోకేశ్వర్ రెడ్డి, దశరథ్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

కదిరి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ స్మిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పూర్తి చేసి 19 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సువారు అర్హులని, ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారు బెంగుళూరు, మంగళూరులో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లు తీసుకువాలని, పూర్తి వివరాలకు 93901 76421కు సంప్రదించాలని సూచించారు.

1.664 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో గురువారం 1.664 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 1239 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 955 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు.

చేతిలో డబ్బులు పోయెనే..

మద్యం షాపుల కోసం రూ.లక్షల్లో ఖర్చు
లాటరీలో దక్కని దుకాణాలు
డబ్బు పోగొట్టుకుని గొల్లుమంటున్న నాయకులు



హిందూపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల లాటరీలో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వెళ్లి చోటామోటా నాయకులు చేతులు కాల్చుకున్నారు. పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకుని, షాపులు దక్కక దిక్కులు చూస్తున్నారు. ఎన్నడూలేని విధంగా మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈసారి చాలామంది ముందుకొచ్చారు. ఇతర ప్రాంతానికి వెళ్లి దరఖాస్తు చేసినవారూ ఉన్నారు. ఇతర రాష్ట్రాలవారు సైతం హిందూపురం ప్రాంతంలోని షాపులకు టెండర్లు వేశారు. వీరిలో కొందరికి దక్కగా.. మరికొందరికి నిరాశే మిగిలింది. ఈసారి కూటమి నేతలతోపాటు ప్రతిపక్ష నాయకులు సైతం టెండర్లు వేశారు. గతంలో మద్యం దుకాణాల వేలంలో కొంతమందే పాల్గొనేవారు. దశాబ్దాలుగా మద్యం దుకాణాల నిర్వహణపై అవగాహన ఉన్నవారు మాత్రమే అడుగుపెట్టేవారు. ఈసారి అధికార పార్టీకి చెందిన నాయకులు చాలామంది మద్యం దుకాణాలపై కన్నేశారు. వందల్లో టెండర్లు వేయగా.. వేళ్లమీద మాత్రమే దుకాణాలు దక్కాయి. 'లాటరీ పోయింది, లక్కు కలిసి రాలేదు. ఉన్న సొమ్ము పోయింది.' మద్యం దుకాణాల పోటీల్లో పాల్గొన్న చోటా నాయకుల పరిస్థితి ఇది. హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 షాపులు ఉండగా 270 వరకు దరఖాస్తులు అందాయి. వాటిలో కొంతమంది ఐదు, పది డీడీలు తీశారు. అయినా దక్కింది 11 మందికే. దీంతో దాదాపు 260 దరఖాస్తుల సొమ్ము పోయినట్లే. జిల్లావ్యాప్తంగా 87షాపులకుగాను 1518 మంది టెండర్లు వేశారు. 1431 టెండర్ల సొమ్ము నాయకులు కోల్పోయినట్లే. సొమ్ము పోయి.. షాపు రాకపోయేసరికి నాయకులు ఉసూరుమంటున్నారు.

లాటరీలో దక్కని షాపులు

తమకే దక్కుతుందని కొంతమంది నాయకులు.. బంధువుల పేరుపై ఐదు నుంచి పది టెండర్లు వేశారు. ఒకటీ దక్కలేదు. లాటరీలో ఎత్తిన టోకను రాకపోయేసరికి డబ్బు పోయి, షాపుపోయి అవమానం పాలయ్యామని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులే ఎక్కువగా పాల్గొని నష్టపోయినట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల వేరొకరికి షాపులు దక్కినా ప్రజాప్రతినిధులు.. వారిని పిలిపించి, కూటమి నాయకులకే ఇవ్వాలని హెచ్చరికలు జారీ చేశారు. కొన్నిచోట్ల ఒత్తిళ్లు, బెదిరింపులకు తలొగ్గి కూటమి నాయకులకు అప్పగించారు. మరికొన్నిచోట్ల లాటరీలో షాపులు దక్కించుకున్న ఇతరులు ఇవ్వడానికి ఇష్టపడలేదు. అలాంటిచోట కూటమి నాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. టీడీపీ నాయకులకు ఇది తీవ్ర నష్టమని ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు.

లక్షలు పోగొట్టుకుని...

మద్యం దుకాణాలకు దరఖాస్తుల రూపంలో సొమ్ము పోగొట్టుకుని పలువురు చోటా నాయకులు గొల్లుమంటున్నారు. నియోజకవర్గంలో మొత్తం తొమ్మిది షాపులు ఉండగా 271 దరఖాస్తులు వచ్చాయి. నాయకులు మద్యం వ్యాపారానికి భారీగా పోటీపడి దరఖాస్తు చేసుకున్నారు. చాలాచోట్ల గ్రూపులుగా ఏర్పడి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. కొన్నిచోట్ల దక్కకపోవడంతో సొమ్ముపోయిందని గొల్లుమంటున్నారు. సొమ్ము పోగొట్టుకున్న వారిలో అధికశాతం టీడీపీ నాయకులే ఉన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు చేయడంతో చోటా మోటా నాయకులు తీవ్రంగా నష్టపోయారు. ఏది ఏమైనా సొమ్ము పోయి.. షాపులు దక్కకపోవడంతో కూటమి నాయకులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.


పిడుగుపాటుకు వ్యక్తి మృతి


జయరామ్ (ఫైల్)

కదిరి అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రం గ్రామానికి చెందిన జయరామ్(45) గురువారం పిడుగు పడి మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జయరామ్ గురువారం గేదెలను మేపునకు తోలుకెళ్లాడు. పొలాల్లో పిడుగు పడి అతడు అక్కడికక్కడే మరణించాడు. సాయంత్రం గేదెలు ఇంటికి వచ్చాయే తప్ప.. జయరామ్ రాలేదు. దీంతో కుటుంబీకులు పొలాల్లో వెతకగా శవమై కనిపించాడు. దీంతో బోరున విలపించారు. జయరామ్‌కు భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు.

అనగనగా ఒక వీఆర్ఏ..!

- ఒక్కరోజూ విధులకు రాలేదు
- పన్నెండేళ్లపాటు విడపనకల్లు నుంచి జీతం
- ఒక్కడి కోసం.. నిబంధనలకు పాతర


లోకేశ్‌కు ఉద్యోగోన్నతి కల్పిస్తూ వచ్చిన ఆర్డర్ కాపీ

విడపనకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సొంత గ్రామం, లేదా సొంత మండలంలో ఉన్నవారు వీఆర్ఏ పోస్టుకు అర్హులు. కానీ విడపనకల్లు మండలంలో గుర్తు తెలియని వ్యక్తికి ఆ పోస్టు ఇచ్చారు. ఏకంగా పుష్కర కాలంపాటు ఇక్కడి నుంచి అతనికి వేతనాలు చెల్లించారు. ఎవరైనా అడిగితే.. ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తుంటాడని స్థానిక అధికారులు సెలవిస్తున్నారు. అతని పేరు లోకేశ్. ఆయన ఉరవకొండ నియోజకవర్గం కాదు.. విడపనకల్లు మండలం కాదు. అనంతపురం నగరంలోని రాం నగర్‌లో ఉంటాడట. 2010-2011లో లోకేశ్‌ను విడపనకల్లు వీఆర్ఏగా చేర్చుకున్నట్లు చూపించి.. కథ నడిపిస్తున్నారు. ఇన్నేళ్లలో ఏ ఒక్క రోజూ విధుల్లో కనిపించింది లేదని, తహసీల్దారు కార్యాలయానికి వచ్చింది లేదని అంటున్నారు. అతన్ని చూసిన ఒక్క అధికారి కూడా ఇక్కడ లేరంటే అతిశయోక్తి కాదు.

ఎందుకంత ప్రాధాన్యం..?

విడపనకల్లు తహసీల్దారు కార్యాలయంలో రెండు వీఆర్ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేసిందే లేదు. కానీ ఒక వీఆర్ఏ లోకేశ్ అని చూపిస్తున్నారు. డీఆర్వో కార్యాలయంలోని ఓ ఉద్యోగి కుమారుడు కావటంతో లోకేశ్‌కు విడపనకల్లు వీఆర్ఏగా ఒక పోస్టు ఏర్పాటు చేయించారని సమాచారం. తండ్రి పలుకుబడితో విడపనకల్లులో విధులు నిర్వర్తించకపోయినా.. ఇక్కడి నుంచి నెల నెలా జీతం పెట్టించారని ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది అక్టోబరులో ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించి.. గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో వాచ్‌మన్‌గా పోస్టింగ్ ఇచ్చారు. విడపనకల్లు మండలంలోని వీఆర్ఏలు వంతులు వారిగా తహసీల్దారు కార్యాలయానికి రోజూ వచ్చి సాయంత్రం వరకూ విధులు నిర్వర్తించి వెళతారు. వీరిలో మహిళలు కూడా ఉన్నారు. కానీ లోకేశ్ మాత్రం ఒక్క రోజూ వచ్చింది లేదు. ఉద్యోగోన్నతి కల్పించాలని భావిస్తే.. లోకేశ్ కంటే మాళాపురం వీఆర్ఏ నారాయణస్వామి సీనియర్. కానీ నారాయణస్వామికి ఉద్యోగోన్నతి కల్పించలేదు. జూనియర్ అయిన లోకేశ్‌కు ప్రమోషన్ ఇచ్చారు. విడపనకల్లుకు చెందిన ఓ యువకుడు లోకేశ్ వివరాలను ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద ఏడాది క్రితం దరఖాస్తు చేశాడు. కానీ ఇప్పటి వరకూ రెవెన్యూ అధికారులు స్పందించలేదు. లోకేశ్ గురించి వివరణ కోరితే, అతనెవరో తనకు తెలియదని, రికార్డులు చూసి చెబుతానని తహసీల్దారు సునితా బాయి అన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏఎన్ఎంకు 6నెలల జైలు

పెనుకొండ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఏఎన్ఎం వడ్డె భారతికి ఆరు నెలల సాధారణ జైలుశిక్ష, రూ.6 లక్షల అపరాధ రుసుం విధిస్తూ పెనుకొండ కోర్టు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ బుజ్జప్ప తీర్పు చెప్పినట్లు కోర్టు కానిస్టేబుల్ బాబ్‌జాన్ తెలిపారు. 2021లో గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన వెంకటనారాయణమ్మ వద్ద ఏఎన్ఎం భారతి రూ.3లక్షలు అప్పు తీసుకుంది. ఆ మేరకు చెక్కులు ఇచ్చింది. బ్యాంకులో చెక్కులను డ్రా చేయడానికి వెళ్తే అవి చెల్లవనడంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం అగళిలో పనిచేస్తున్న ఏఎన్ఎం భారతికి రిమాండ్ విధించారు. ఆమెను రిమాండ్‌కు తీసుకుంటుండగా కుటుంబ సభ్యులు.. పోలీసులతో వాగ్వాదానికి దిగి, తప్పించారు. దీనిపై కూడా కేసు నమోదైంది. ఈ కేసులోనూ ఏఎన్ఎం భారతి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో చెక్‌బౌన్స్ కేసును విచారించిన న్యాయాధికారి జైలుశిక్ష, అపరాధ రుసుం విధిస్తూ తీర్పు వెలువరించారు. అపరాధ రుసుం చెల్లించని పక్షంలో అదనంగా నెలన్నర జైలుశిక్ష అనుభవించాలని అందులో పేర్కొన్నారు.

సనాతన ధర్మ వ్యాప్తికి కృష్ణదేవరాయల కృషి


శ్రీకృష్ణదేవరాయల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మైనాస్వామి, నాయకులు

గోరంట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ వ్యాప్తికోసం విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు విశేషంగా కృషి చేశారని చరిత్రకారుడు మైనాస్వామి అన్నారు. స్థానిక మాధవరాయ ఆలయంలో శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని గురువారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. మైనాస్వామి మాట్లాడుతూ.. విజయనగర సామ్రాజ్యంలో ఆలయాలను అధిక సంఖ్యలో నిర్మించడం ద్వారా సనాతన ధర్మపరిరక్షణకు రాయలవారు ఎంతగానో కృషిచేశారన్నారు. భక్తికోసం కాకుండా పరిపాలన కేంద్రం, విద్యాలయం, వైద్యాలయంగా ఆలయాలు ఉపయోగపడినట్లు చారిత్రక ఆధారాలున్నాయన్నారు. రాయలు అనుసరించిన ధర్మతత్వం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. విజయనగర సామ్రాజ్యంలో ప్రజలు సుఖంగా జీవించారన్నారు. ఉదయగిరి, రాయచూరు యుద్ధాలు మినహా రాయలు.. పెద్దగా యుద్ధాలకు అవకాశం ఇవ్వలేదన్నారు. ఆయన సైన్యాన్ని, రక్షణ పద్ధతులను తెలుసుకున్న శత్రురాజులు యుద్ధాలు విరమించుకుని రాయలకు సామంతులయ్యారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీశ్వర్, సుధాకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాయలసేవా సమితి సూరి, రామప్ప, నాగభూషణ, అశ్వత్థరెడ్డి పాల్గొన్నారు.

వర్షార్పణం..

వర్షానికి నేలరాలిన అండుకొర్ర

తనకల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మూడు రోజులుగా ఎడతెరపిలేని వర్షం కారణంగా అండుకొర్ర పూర్తిగా దెబ్బతింది. నడిమికుంటపల్లిలో వెంకటరమణారెడ్డి ఈ ఖరీఫ్‌లో ఐదు ఎకరాల్లో ఈ పంట సాగుచేశాడు. పంట గింజపట్టే సమయంలో వర్షం రాకపోవడంతో పక్క రైతుల నుంచి నీటి తడులు ఇచ్చారు. దీంతో పంట బాగా పండింది. ఎకరా పొలంలో ఒక రోజు పంటను కోసి మోపులు కట్టారు. మిగిలిన పంట కోస్తుండగా వర్షాలు ప్రారంభమయ్యాయి. కోసి కుప్పగా వేసిన పంట మొత్తం కుళ్లిపోయింది. మిగిలిన నాలుగు ఎకరాల్లోని పంట పూర్తిగా రాలిపోయింది. దీంతో తనకు రూ.నాలుగు లక్షల వరకు నష్టం జరిగిందని రైతు వాపోతున్నాడు.


కుప్పవేసిన అండుకొర్ర


పొలంలోనే రాలిపోయిన పంట

కూలిన ఇంటి పైకప్పు



ముదిగుబ్బ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఎస్ బండ్లపల్లిలో వీరనారప్పకు చెందిన ఇంటి కప్పు గురువారం కూలింది. దీంతో తనకు రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోతున్నాడు. కాగా కప్పు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైది. అయితే ఆ గదిలోని టీవీ, ఫ్యాను, ఇతర వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

కుంటను తలపిస్తున్న రోడ్డు

నల్లమాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓడీసీ, నల్లమాడ ప్రధాన రహదారిలోని చౌటకుంటపల్లిలో కొద్దిపాటి వర్షానికే కుంటను తలపించేలా వర్షపు నీరు ఇలా నిల్వ ఉంటోంది. వాహనాలు వచ్చినప్పుడు ఆ నీరు సమీపంలోని ఇళ్లల్లోకి వెళ్తున్నాయి. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లానా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


చౌటకుంటపల్లి ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు

వర్షపు నీరు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రోడ్డుపై నిలిచిన నీటిని తొలగిస్తున్న సిబ్బంది

నంబులపూలకుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఓ చిన్నపాటి వాన వచ్చినా.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిల్వ ఉండేంది. దీంతో వాహనదారులతో పాటు.. పాదచారులూ తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై ఆంధ్రజ్యోతి గురువారం ఈ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఈఓఆర్డీ మాధవరెడ్డి... ఎక్స్‌కవేటర్‌తో కాలువలు తీయించి.. రోడ్డుపైన నీరు నిలువ లేకుండా చేశారు.

గ్రామాల్లో పల్లె పండుగ

నల్లమాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక హమాలీ, బెల్దారి క్వాటర్స్‌తో పాటు.. సోముగుట్టపల్లి, కొండ్రవారిపల్లి, ఎద్దులవారిపల్లి తండా, ఎద్దులవారిపల్లి తదితర గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ రంగనాయకులు, ఇన్‌చార్జీ ఎంపీడీఓ రాబర్టువిల్సన్, అన్నిశాఖాల అధికారులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

కొత్తచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాల్ నగర్‌లో మూడు రోజుల క్రితం రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మణా నికి ఎమ్మెల్యే సింధూరారెడ్డి భూమి పూజ చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించారు. ఆ పనులను జిల్లా పంచాయతీ అధికారి సమత గురువారం తనిఖీ చేశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ఎండీఓ నటరాజ్, ఈఓ శ్రీనివాసరెడ్డి, అజయ్ ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

తనకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కదిరి ఆర్డీవో వీవీ శర్మ స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలపై ఆరాతీశారు. సమస్యలుంటే వెంటనే అధికారులకు తెలపాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శోభానువర్షమ్మ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బెల్టుషాపులు నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐబి. మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బెల్టు షాపులు ఇచ్చేందుకు బ్రాందీషాపు నిర్వాహకులకు ఎలాంటి హక్కులూ లేవన్నారు. ప్రభుత్వం అనుమతి లేకుండా ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ముదిగుబ్బ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామస్వామి తండాకు చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మా నాయక్ (90) అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న టీడీపీ హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ హేమలతాభాయ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించింది. రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసింది.

అధికారుల అలసత్వం..!

సత్యసాయి జిల్లా పశువైద్యాధికారుల అలసత్వం... రెండు మండలాల్లోని పాడి రైతుల పాలిట శాపంగా మారనుంది. ఏపీ ఆస్పత్రికి ఎన్ని రూ. లక్షలు మందులు అవసరం అనే ఇండెంట్ తయారుచేయడంలో తప్పిదం జరిగింది. సాధారణంగా మండలంలో పశువుల సంఖ్య ఆధారంగా మందుల ఇండెంట్ తయారు చేయాలి. కాని.. ఈ సారి పశువైద్యశాలల సంఖ్య ఆధారంగా ఈ ఇండెంట్ తయారు చేశారు. దీంతో బత్తలపల్లి, తాడిమర్రి మండలాలకు కలిపి దాదాపు రూ. 50 లక్షల ఇండెంట్ పెట్టాల్సి ఉండగా.. కేవలం రూ. 8 లక్షలు మాత్రమే పెట్టారు. పాడిరైతులపై మందుల రూపంలో ఆర్థిక భారం పడనుంది.



బత్తలపల్లి పశువైద్యశాల

- మందుల ఇండెంట్ విషయంలో నిర్లక్ష్యం
- రెండు మండలాలకు తక్కువగా పెట్టిన వైనం
- పశువుల సంఖ్యతో నిమిత్తం లేకుండా వైద్యశాలల ఆధారంగా ఇండెంట్
- మందుల రూపంలో పాడిరైతులపై పడనున్న ఆర్థికభారం



బత్తలపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పశువైద్యాధికారుల అలసత్వం కారణంగా రెండు మండలాల పాడిరైతులు, గొర్రెల పెంపకందారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. వారిపై మందుల కొనుగోలుకు అదనపు భారం పడునుంది. ఎప్పటిలాగే 20 రోజుల క్రితం జిల్లా పశువైద్యాధికారులు ఏపీ ఆస్పత్రికి ఎన్ని లక్షలు మందులు అవసరం అనే ఇండెంట్ తయారు చేశారు. మండలంలోని పశువుల సంఖ్య ఆధారంగా ఇండెంట్ తయారు చేయకుండా.. పైశువైద్యశాలల సంఖ్య ఆధారంగా ఇండెంట్ తయారు చేశారు. బత్తలపల్లి మండలంలో రెండు, తాడిమర్రి మండలంలో ఒక వైద్యశాల ఉండటంతో.. పశువుల సంఖ్య ఎక్కువగా ఉన్నా... వీటికి తక్కువగా ఇండెంట్ పెట్టారు. రెండు మండలాలకు కలిపి దాదాపు రూ. 50 లక్షలు ఇండెంట్ పెట్టాల్సి ఉండగా.. కేవలం రూ.8 లక్షలు మాత్రమే పెట్టారు. కనగానపల్లి మండలంలో ఐదు పశువైద్యశాలలు, 10 వేల వరకు పశువులు, 1.40 లక్షల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటికి దాదాపు రూ.25 లక్షలు ఇండెంట్ పెట్టారు. అలాగే రామగిరి మండలంలోనూ ఐదు పశువైద్యశాలలు ఉండగా ఐదు వేల వరకు పశువులు, 1.10 లక్షల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటికి కూడా రూ.25 లక్షల వరకు ఇండెంట్ పెట్టారు. బత్తలపల్లి మండలంలో రెండు పశువైద్యశాలలు ఉండగా 12,500 పశువులు, 1.15 లక్షల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. తాడిమర్రి మండలంలో 12,500 పశువులు, 1.20 లక్షల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. అయితే ఈ రెండు మండలాల ఆస్పత్రులకు కలిపి కేవలం రూ. 8 లక్షలు మందులు మాత్రమే ఇండెంట్ పెట్టారు. దీంతో ఈ ఆస్పత్రుల పరిధిలోని పాడి రైతులకు తీవ్ర అన్యాయం జరగబోతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పశువులు, గొర్రెలు,. మేకలు రోగాల బారిన పడుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా పశువైద్య ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఈ మండలాలకు తగినన్ని.. మందులు కేటాయించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కదిరిలో అగ్నిప్రమాదం

కదిరి అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జీవిమాను సర్కిల్ సైకిల్ స్పేర్ పార్ట్స్, పంచర్ దుకాణంలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. దుకాణ యజమాని సుహేల్ గురువారం సాయంత్రం దుకాణం మూసివేసి.. ఇంటికి వెళ్లాడు. రాత్రి 7.45 గంటల సమయంలో దుకాణంలో నుంచి మంటలు వస్తుండటాన్ని గమనించి.. స్థానికులు అతనికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది స్థలానికి చేరుకుని, మంటలు అదుపులోకి తెచ్చారు. దుకాణంలోని సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో రూ.15 లక్షలు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

కాలిపోయిన దుకాణం →



చెన్నకేశవుడికి గరుడసేవ

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామిని గురువారం రాత్రి గరుడ వాహనంపై ఊరేగించారు. ప్రతిపౌర్ణమి నాడూ గరుడసేవ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశులు పేర్కొన్నారు. చెన్నకేశవస్వామిని పట్టువస్త్రాలు, వివిధ రకాలపూలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే విధంగా దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనలను, కోలాటాలు చేశారు.

గరుడ వాహనంపై స్వామివారు →



పన్నులు సకాలంలో వసూలు చేయండి

ధర్మవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, నీటి పన్నులను సకాలంలో వసూళ్లు చేసి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువగా అంచనా వేసినా ఆస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలన్నారు. ఆదాయ లీకేజీని నిరోధించేందుకు పన్నులు విధించాలన్నారు. పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచడంతో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఆర్వో, ఆర్ఐ శివ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఐగా వీరన్న



పుట్టపర్తిరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా వీరన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వచ్చారు.

ఎస్ఐగా సోమశేఖర్



బత్తలపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల ఎస్ఐగా సోమశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు ధర్మవరం రూరల్‌కు బదిలీ కావడంతో ఇంటలిజెన్స్‌లో పని చేస్తున్న ఎస్ఐ సోమశేఖర్ ఇక్కడికి బదిలీ అయ్యారు.

స్కూల్ కాంప్లెక్స్‌లోనే శిక్షణా తరగతులు చేపట్టాలి

పుట్టపర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లోనే శిక్షణా తరగతులు నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ గురువారం డిమాండ్ చేశారు. శిక్షణా తరగతులను హిందూపురం బీఎడ్ కాలేజీలో నిర్వహించడం వల్ల ఏకోపాధ్యాయ పాఠశాల విద్యార్థులకు బోధన లేకుండా పోతుందన్నారు. స్కూల్ కాంప్లెక్స్‌లోనే ఈ తరగతులు నిర్వహిస్తే.. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులు, గర్భిణీలు, చంటిపిల్లల తల్లులు దూరప్రయాణం చేయాల్సిన అవసరం ఉండదన్నారు.

అమలుకాని ఉపాధి హామీ

తాడిమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీని ఇప్పటికైనా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘం నాయకుడు కాటమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఈ హామీ ఇచ్చిన నాయకులు.. ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ ఊసే తేవడం లేదని మండిపడ్డారు. ఈ అనుసంధానం ద్వారా రైతులకు, వ్యవసాయ కూలీలకు చాలా మేలు జరుగుతుందన్నారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ఈ హామీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, కుళ్లాయప్ప, దాసన్న పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు


కేంద్ర మంత్రితో కదిరి ఎమ్మెల్యే కందికుంట

కదిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయండి

కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే కందికుంట వినతి

కదిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర పర్యాటక, సంస్కృతిక శాఖమంత్రి గజేంద్రసింగ్ షేకావత్‌ను గురువారం ఢిల్లీలో కోరినట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తికి కదిరి కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉందని, కదిరి ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను, ప్రజాకవి యోగివేమన ఆలయంతో పాటు పలు పర్యాటక ప్రాంతాలున్నాయని వివరించినట్లు తెలిపారు. వీటన్నింటిని కలుపుకుని కదిరి ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరినట్లు వివరించారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

సరుకుల పంపిణీ

పుట్టపర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ తన తండ్రి జానకీ రామయ్య 21వ వర్ధంతి సందర్భంగా 120 మంది మున్సిపాల్టీ కార్మికులకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మొదట జానకీ రామయ్య ఘాట్ వద్ద నివాళులర్పించిన ఆయన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, ఏపీసీసీ సభ్యుడు కోటా సత్యం, మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద, డీఎస్పీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కార్మికులకు సరుకులు పంపిణీ చేస్తున్న రత్నాకర్


కదిరి: వాల్మీకి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

ఘనంగా వాల్మీకి జయంతి

కదిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి, బోయ సంఘం నాయకులు పట్టణంలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కోనేరు సర్కిల్ నుంచి వాల్మీకి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగారు క్రిష్ణమూర్తి, కుటాగుళ్ల గంగరాజు, ఆనంద్ పలువురు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: వాల్మీకి మహర్షి జయంతిని మండల కేంద్రంలోని వాల్మీకులు గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు కనుమ ప్రభాకర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వాల్మీకి జయంతిని ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని, వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● బుక్కపట్నం: స్థానిక వాల్మీకి రామాలయంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక వాహనంలో వాల్మీకి చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వాల్మీక సంఘం నాయకులు పాల్గొన్నారు.

● ధర్మవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్దగల వాల్మీకి మహర్షి విగ్రహానికి పలువురు ప్రముఖులు, వాల్మీకి సంఘం నాయకులు పూలమాలలు వేశారు. ఇందులో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు బోయరవిచంద్ర, బొట్టుకిష్ట, చీమలరామాంజి, చీమల సూరి, నరేశ్, జింకల రాజన్న, పూజా మొబైల్ సాయి పాల్గొన్నారు.

● గాండ్లపెంట : మండలకేంద్రంలో వాల్మీకి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఇందులో వాల్మీకి సంఘం నాయకులు ఆనంద్, శివ, అంజి, ఉత్తన్న పాల్గొన్నారు.

బత్తలపల్లి : వాల్మీకి సంఘ నాయకులు స్థానిక నరసింహస్వామి గుడి వద్ద నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కూడలిలో వాల్మీకి చిత్ర పటాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. ఇందులో మండల శ్రీనివాసులు, నరసింహులు, లక్ష్మినారాయణ, గంగాధర పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

● తనకల్లు: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోంపాళ్యం నాగభూషణం, కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, క్లస్టర్ ఇన్‌చార్జి పీజీ మల్లికార్జున, జనసేన కన్వీనర్ కేవీ రమణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, పులి మహేష్, వాల్మీకి శంకర్, శ్రీనివాసులు, రామక్రిష్ణ, జయచంద్ర పాల్గొన్నారు.

● కొత్తచెరువు : బుక్కపట్నం రహదారిలో ఉన్న వాల్మీకి విగ్రహానికి కూటమి నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు పూల మాలలు వేసి.. పూజలు నిర్వహించారు. ఇందులో కూటమి నాయకు లు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, అడపాల రామకృష్ణ, బండ్లపల్లిరాజు, ఒలిపి శీన, పెద్దన్న, లక్ష్మీనారాయణ, గాజులచంద్ర, సైకిల్‌షాపు బాబా, డిపోభాస్కర్, సమితి చంద్ర, రాధా, నరసింహులు పాల్గొన్నారు.

● తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల, తాడిమర్రి, అగ్రహారం, నారసింపల్లి గ్రామాల్లో ఉదయం వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

● ఓబుళదేవరచెరువు: మండలంలోని గౌరాపురంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామభజనలు, కీర్తనలు అలపించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు, అన్నదానం నిర్వహించారు.


ముదిగుబ్బ: వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వాల్మీకులు

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీంపై అవగాహన

కదిరి అర్బన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ స్కీంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిత్మ మాట్లాడుతూ... యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించిందన్నారు. విద్యార్థులను నైపుణ్యంపరంగా మెరుగుపరడమే దీన్ని ఉద్దేశమన్నారు. ముఖ్యంగా చమురు, గ్యాస్, ఇంధన రంగంలో ఉపాధి అవకాశాల కోసం ఈ స్కీం ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. ట్రావెల్, టూరిజం, ఆటోమోటీవ్, బ్యాకింగ్, ఆర్థిక సేవలు, కార్యకలాపాలు, ఉత్పత్తి, తయారీ, అమ్మకాలు, మార్కెటింగ్‌పై యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలుంటాయన్నారు. ఈ స్కీంకు 21 నుంచి 24 మధ్య వయస్సుగల బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బిఫార్మ, డిగ్రీవారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హైదర్‌వలీ, ఆదినారాయణ, చెన్నారెడ్డి, సుందరమోహన్‌రెడ్డి, రవీంద్ర, అశోక్, పీడీ నరసింహాచారి పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న తిప్పేస్వామి

చంద్రన్నతోనే పేదలకు సంక్షేమం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల

మడకశిర టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. గురువారం బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో పట్టణానికి చెందిన 60 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వైసీపీకి చెందిన ఎస్.ఎ.రాజేష్, రాజేంద్ర, రాము, జయరామప్ప, నాగరాజు, అశోక్, అరుణ, లావణ్య, గిరిజ, లక్ష్మీదేవమ్మ, అశ్వత్థమ్మతో పాటు 60 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. వారందరికీ తిప్పేస్వామి కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారు మాట్లాడుతూ పేదల సంక్షేమం ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని, విశ్వసించి పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ ఉమాశంకర్, తిమ్మరాజు, రఘురాం ఉన్నారు.

రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు

● డీఈ జగదీష్ గుప్తా



ఫలారం వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

మడకశిర, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బీ పరిధిలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ డీఈ జగదీష్ గుప్తా, ఏఈ నరసింహమూర్తి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. వాటిని పరిశీలించి ఎస్టిమేట్ వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. తాత్కాలిక మర్మతులకు రూ.50లక్షలు అవసరమని తెలిపారు. భక్తరపల్లి రోడ్డు, అగలి-జంబులబండ రోడ్‌లో ఫలారం వద్ద కల్వర్టు, ఇటికేపల్లి వద్ద కల్వర్టు, రోళ్ల-మధూడి రోడ్డు, రోళ్ల-వసికెర రోడ్‌లలో పలు చోట్ల దెబ్బతిన్నాయని వాటికి సంబంధించి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.

చెరువులకు చేరిన నీరు



కొంకల్లు చెరువుకు చేరిన వర్షపునీరు

గుడిబండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువులకు నీరు చేరాయి. మండలంలోని కొంకల్లు, చిగతుర్పి, రాజబండ, మోరుబాగల్ తదితర చెరువులకు నీరు చేరాయి. దీంతో బోరు బావుల్లో నీటి మట్టం పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధితులకు అండగా టీడీపీ



బాధితురాలిని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న బోయశంకర్, చంద్రకళకు టీడీపీ నాయకులు అండగా నిలిచారు. గురువారం బాధితుల ఇళ్లవద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం తమ వంతుగా ఆర్థికసాయాన్ని అందించారు. హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, నరసింహులు, మోహన, మద్దిలేటి, ఆనంద్, అశోక్, పూజారి మురళి, అంజి పాల్గొన్నారు.

పలకల మరువకు మరమ్మతులు



మరువకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పరిగి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా జయమంగళి నదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. హంద్రీనీవా కాలువ ద్వారా పరిగి చెరువుకు ఆ నీరు చేరుతున్నాయి. చెరువులోని మరువకు దగ్గరగా ఉన్న తూముకు నీరుచేరుతుండటంతో ముందస్తు చర్యగా ఇరిగేషన్ రెవెన్యూ, పోలీస్ అధికారుల ఆదేశాలతో గురువారం పలకల మరువకు మరమ్మతులు చేయడానికి ధనాపురం, చిన్నపల్లి, విట్టాపల్లి, పైడేటి, చెరువుకు దిగువ ఉన్న ప్రాంతాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు.

సెక్యూరిటీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్దనున్న బెస్టు యూనివర్సిటీలో సెక్యూరిటీ ఉద్యోగిగా పనిచేస్తున్న కార్తీక్ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతపురంలోని నారాయణపురానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు కార్తీక్ స్రవంతితో ప్రేమ వివాహం జరిగింది. దంపతులిద్దరూ నెలరోజులక్రితం బెస్టు యూనివర్సిటీలో సెక్యూరిటీ ఉద్యోగులుగా చేరి, అక్కడే నివాసమున్నారు. కార్తీక్ గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి అతనిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఆటో, బొలెరో ఢీ.. ఆరుగురికి గాయాలు

మడకశిరటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద గురువారం బొలేరో ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మడకశిర వైపు నుంచి వస్తున్న బొలెరో ఆటోను ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న రంగప్ప, వాసుదేవరావు, రత్నమ్మ, శారదమ్మతోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు.

ఆదర్శప్రాయుడు.. మహర్షి వాల్మీకి

ప్రపంచానికి శ్రీరాముడి చరిత్రను రామాయణం రూపంలో అందించిన మహర్షి వాల్మీకి అందరికీ ఆదర్శప్రాయుడని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా పెనుకొండలోని బోయగేరిలో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి నివాళి అర్పించారు. అలాగే హిందూపురం, మడకశిర, గోరంట్ల, పరిగి, అగళి, సోమందేపల్లి తదితర ప్రాంతాల్లో పలువురు నాయకులు, అధికారులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



హిందూపురంలో జ్యోతుల ఊరేగింపు



పెనుకొండ: టీడీపీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి సవిత



గోరంట్లలో..



సోమందేపల్లిలో..



పావగడలో...

రహదారులు గుంతలమయం.. ప్రయాణం నరకం..



బురదమయంగా మారిన మంగాపురం రోడ్డు

పెనుకొండ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. పెనుకొండ నుంచి కోనాపురం వెళ్లే రహదారి ఛిద్రమైంది. మడకశిర రహదారి, కోనాపురం, కొండాపురం, మంగాపురం వెళ్లే రోడ్డును పంచాయతీ అధికారులు, రియల్ వ్యాపారులు కుమ్మక్కై డైవర్ట్ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పెనుకొండ ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరంతా కోనాపురం వైపే వెళుతున్నాయి. వర్షానికి గుంతలమయంగా మారిన రోడ్డులో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు గుంతలమయం కావడంతో చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రమాదాల బారినపడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పాలకులు, పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా మడకశిర-కోనాపురం వెళ్లేదారి సమస్యగా మారడంతో రోడ్డును పరిశీలించామన్నారు. డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి తరువాతరోడ్డు నిర్మిస్తామని తెలిపారు.

దెబ్బతిన్న రహదారులు

మడకశిర రూరల్: నియోజకవర్గంలో మూడు రోజులగా కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మడకశిర-పెనుకొండ ప్రధాన రహదారి కర్ణాటక సరిహద్దు మురారాయణపల్లి వద్ద రోడ్డు కుంగిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్ అనంతపురం-ఉంతురుకువాండ్లపల్లి ప్రధాన రహదారి గుంతలమయమై ఆటోలు కూడా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జడివానతో ఇళ్లలోకి నీరుచేరి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.



మురారాయణపల్లి రోడ్డులో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

నేటి నుంచి భూ రీసర్వేపై గ్రామ సభలు

చిలమత్తూరు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17: గత ప్రభుత్వంలో భూరీసర్వే చేసిన గ్రామాల్లో భూసమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల భూరీసర్వే ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ యునస్ గురువారం ఒకప్రకటనలో తెలిపారు. రైతులకు, భూ యజమానులకు ఏవైనా సమస్యలుంటే తెలుపుకోవాలన్నారు.

పరిగి: మండలంలో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హసీనాసుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బందార్లపల్లి, విట్టాపల్లి, సంగమేశ్వరపల్లి, యర్రగుంట, శాసనకోట, గణపతిపల్లిలో గత వైసీపీ పాలనలో భూరీసర్వే చేసిన గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గోరంట్ల: మండలంలో రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మారుతి తెలిపారు. 18న కాటేపల్లి, 21న రాగిమేకలపల్లి, 22న ఓబుళాపురం, 24న దేవులచెరువు, 25న మరెడ్డిపల్లి, 26న డెక్కసముద్రం, 28న జౌకలేటిదిన్నె, 29 కమ్మవారిపల్లి, 30న పాలసముద్రం, నవంబరు 1న బోగానిపల్లి, 2న బయ్యన్నకుంటపల్లి, 3న బోయలపల్లిలో సభలుంటాయన్నారు.

మందుబాబులకు అడ్డా.. పంచాయతీ కార్యాలయం



మందలపల్లి సచివాలయం



కార్యాలయ ఆవరణలో మద్యం ప్యాకెట్లు

గుడిబండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లి పంచాయతీ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పంచాయతీ కార్యాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. కార్యాలయంలో ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించి రైతులకు వన్‌బీలు, కులధ్రువీకరణ పత్రాలు, తదితర సేవలు అందించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించారు. అయితే మందలపల్లి పంచాయతీ కార్యాలయంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారినా పట్టించుకొనే నాథుడే లేడని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసినా కర్ణాటక మద్యం బాటిళ్లు, ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు ఈ కార్యాలయాన్ని కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాళాలు ఎప్పుడు తీసి ప్రజలకు రైతులకు సేవలు అందిస్తారో ఎవరికీ తెలియడం లేదు. దీంతో పనివేళల్లో కూడా కార్యాలయానికి తాళాలు వేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ గంగాధర్ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరయ్యే విధంగా చూస్తామని అన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

మడకశిర రూరల్, అక్టోబరు17 :(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రపుకొండ గ్రామానికి చెందిన రంగనాథ్ ప్రకృతి వ్యవసాయంలో యూనిట్ ఇన్‌చార్జిగా చేసేవాడు. వారంరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. మడకశిర డివిజన్ ప్రాజెక్టు అధికారులు గురువారం ఆ గ్రామానిక వెళ్లి మృతుడి భార్య జయమ్మకు రూ.60 వేలు ఆర్థికసాయం అందించినట్లు ఇన్‌చార్జి రమేష్ తెలిపారు.

చినుకు పడితే.. ప్రయాణికులకు పాట్లు



వర్షంలో తడుస్తున్న ప్రయాణికులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ రైల్వే స్టేషన్‌లో చినుకుపడితే ప్రయాణికుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి 22 రైళ్లు రాకపోకలు కొనసాగుతుంటాయి. చినుకుపడితే రైలు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. రైల్వే స్టేషన్‌లో ఉన్న ప్లాట్‌ఫాంలో పై నుంచి నీరు కారడంతో ప్రయాణికులు తడిసిపోతున్నారు. రైల్వే అధికారులు స్పందించి ప్లాట్‌ఫాంకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిపోయిన ఇల్లు

అమరాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో న్యూ ఎస్సీ కాలనీలో ఉంటున్న సిద్దప్ప ఇల్లు నాలుగు రోజుల నుండి కురిసిన వర్షానికి బుధవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా ఒక్కసారిగా కూలడంతో నిద్రిస్తున్న వారికి ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ ఇంటిలో ఉన్నటువంటి నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులను కుటుంబ సభ్యులు ఒక్కొక్కవస్తువును వెనువెంటనే బయటకు లాక్కొని రావడం జరిగింది. కూలీ పోతేనే పూట గడుస్తుంది కానీ మేము నిరుపేదలం ఇల్లు కట్టుకోలేని నిర్భాగ్యులం, ఉన్నపళంగా ఇల్లు కూలడంతో నిరాశ్రయులయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉండటానికి ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని సిద్దప్ప వేడుకొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లోనే శిక్షణా తరగతులు చేపట్టాలి

పుట్టపర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లోనే శిక్షణా తరగతులు నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ గురువారం డిమాండ్ చేశారు. శిక్షణా తరగతులను హిందూపురం బిఎడ్ కాలేజీలో నిర్వహించడం వల్ల ఏకోపాధ్యాయ పాఠశాల విద్యార్థులకు బోధన లేకుండా పోతుందన్నారు. స్కూల్ కాంప్లెక్స్‌లోనే ఈ తరగతులు నిర్వహిస్తే.. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులు, గర్భిణీలు, చంటిపిల్లల తల్లులు దూరప్రయాణం చేయాల్సిన అవసరం ఉండదన్నారు.

ఊరూరా పల్లెపండుగ

మడకశిర రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీల్లో పల్లె పండుగ వారోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం మెళవాయి, చందకచర్ల, గుండుమల, ఆమిదాలగొంది, కదిరేపల్లి, హరేసముద్రం, వైబీ హళ్ళి పంచాయతీల్లో పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహించారు. మాజీ సర్పంచులు గుండుమల చంద్రప్ప, నర్సేగౌడు మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సోనియాబాయి, ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.



మెళవాయిలో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

సోమందేపల్లి: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పందిపర్తి పంచాయతీ మంచేపల్లి గ్రామంలో రూ.10లక్షతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను అధికారులు, నాయకులు గురువారం ప్రారంభించారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ మూర్తి, ఫక్రుద్దీన్, మల్లికార్జున ఫీల్డ్ ఆఫీసర్ గంగాధర్, జనసేన నాయకుడు రామచంద్ర పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని సోముగట్ట, హులికుంట గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, గురుమూర్తి, పాండురంగప్ప, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్, ఏపీఓ ఓబుళప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, టీడీపీ నాయకులు సిద్దగంగప్ప, రామకృష్ణ, బాలకృష్ణ, ముదపేగౌడ్ పాల్గొన్నారు.

లేపాక్షి: మేరకు లేపాక్షి, కంచిసముద్రం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం గురువారం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. గీన్‌పార్క్ నాగరాజు, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

షెల్టర్ హోమ్‌ను ప్రారంభించిన మంత్రి



మంత్రికి బొకే అందజేస్తున్న సమత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన షెల్టర్ హోమ్‌ను బీసీ, చేనేత జౌళిశాఖల మంత్రి సవిత గురువారం ప్రారంభించారు. సమత గ్రామీణ విద్య అభివృద్ధి సంస్థ (సమత) ఆధ్వర్యంలో గురువారం మడకశిర వెళ్లే రహదారిలో ఈ షెల్టర్ హోమ్‌ను ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ పెనుకొండ డివిజన్ కేంద్రంలో వివిధ ప్రాంతాలకు బస్సుల రాకపోకలున్నాయని, చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే సమయంలో వారికి సంబంధించిన బస్సు తప్పిపోతే ఈ షెల్టర్ హౌస్‌లో ఉండి ఉదయం వెళ్లవచ్చన్నారు. అంతేకాక వారికి భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తారన్నారు. సమత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఆదినారాయణరెడ్డి, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న నిమ్మల కుటుంబ సభ్యులు

గోరంట్ల, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో ఉమారామలింగ చౌడేశ్వరీదేవి ఆలయ నిర్మాణానికి నిమ్మల కుటుంబ సభ్యులు గురువారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి నిమ్మల కుటుంబ సభ్యులు అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. గతంలో నిర్మించిన ఆలయం వాస్తుకు విరుద్ధంగా ఉందని తొలగించి, నూతన ఆలయానికి శ్రీకారం చుట్టారు. పురోహితులు భాస్కర్‌తారానాథ్ శర్మ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. మాజీ ఎంపీ నిమ్మలక్రిష్టప్ప, వరలక్ష్మీ, నిమ్మల చంద్రశేఖర్, సత్యవాణి, నిమ్మల యువశేఖర్, విద్యాధరణి దంపతులు పాల్గొన్నారు. దేవాంగుల సంఘం నాయకులు వట్టే వెంకటరమణ, నారాయణస్వామి, నాగరాజు, పట్టా నారాయణ, రామచంద్ర, కెంపుల లక్ష్మణ, రామాంజనేయులు, రవి పాల్గొన్నారు.

దసరా బోనస్ ఇవ్వాలని కార్మికుల ఆందోళన

గోరంట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామం వద్దనున్న శ్యాండల్స్ పరిశ్రమలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు దసరా బోనస్ చెల్లించాలని గురువారం ఆందోళన చేపట్టారు. పరిశ్రమలో 650 మంది కార్మికులు పనిచేస్తుండగా, వారికి దసరా బోనస్ ఇవ్వలేదనితెలుసుకున్న సీఐటీయూ నాయకులు రమేష్, కమల్‌బాషా పరిశ్రమ వద్దకు చేరుకుని కార్మికులతో కలిసి నిరసన చేశారు. వారు మాట్లాడుతూ కార్మికులతో బలవంతంగా ఓటీ చేయిస్తున్నారని, బోనస్ ఇవ్వలేదన్నారు. స్పందించిన పరిశ్రమ యాజమాన్యం భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా చర్యలు చేపడతామని తెలపడంతో వారు ఆందోళన విరమించారు.

కంటి అద్దాల పంపిణీ

అగళి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి జడ్పీటీసీ ఉమేష్ కంటి అద్దాలు అందజేశారు. గతంలో కూడా పలుమార్లు కంటి వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఆపరేషన్ చేయించుకున్న వారికి అద్దాలు అందించారు.



కంటి అద్దాలు అందజేస్తున్న జడ్పీటీసీ ఉమేష్

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీంపై అవగాహన

కదిరి అర్బన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ స్కీంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిత్మ మాట్లాడుతూ... యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించిందన్నారు. విద్యార్థులను నైపుణ్యంపరంగా మెరుగుపరడమే దీన్ని ఉద్దేశమన్నారు. ముఖ్యంగా చమురు, గ్యాస్, ఇంధన రంగంలో ఉపాధి అవకాశాల కోసం ఈ స్కీం ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. ట్రావెల్, టూరిజం, ఆటోమోటీవ్, బ్యాకింగ్, ఆర్థిక సేవలు, కార్యకలాపాలు, ఉత్పత్తి, తయారీ, అమ్మకాలు, మార్కెటింగ్‌పై యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలుంటాయన్నారు. ఈ స్కీంకు 21 నుంచి 24 మధ్య వయస్సుగల బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బిఫార్మ, డిగ్రీవారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు

లేపాక్షి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగేపల్లివద్ద వెలసిన హజరత్ పీర్ భక్తర్‌వలి ఉరుసు ఉత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ నిర్వాహకులు ముక్తియార్, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను జరిగాయి. పెనుకొండ బాబయ్య స్వామి వంశస్తులు అబ్దుల్ రహిమాన్ సమక్షంలో గంధంను వైభవంగా నిర్వహించారు. గంధాన్ని కలుపుకుని స్వామివారికి సమర్పించారు. వారు మాట్లాడుతూ ఇస్లామిక్ క్యాలెండర్ మేరకు గ్యార్మీ మాసంలో 11వ రోజున ఈ వేడుకలు నిర్వహిస్తామన్నారు. వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



ఉరుసు నిర్వహిస్తున్న భక్తులు